రోడ్డు నియమాలు పాటించాలి

జంగారెడ్డిగూడెం: నిబంధనలు పాటించకుండా అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని మోటార్ వెహికల్ ఇనెస్పెక్టర్ ఏవీఎస్ ప్రసాద్ అన్నారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలో శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ ప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు తెలుసుకుని వాటిని ఆచరించడం ద్వారా సురక్షిత ప్రయాణాలు చేయవచ్చన్నారు. ఒకరి అజాగ్రత్త, మరొకరికి చేటుగా పరిణమించరాదని, ప్రజలు రోడ్డు నియమ నిబంధనలు తెలుసుకుని పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ పి.గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్సై ఎం.సాగర్‌బాబు అన్నారు. జంగారెడ్డిగూడెం బొసుబొమ్మ సెంటర్‌లో ఎస్సై ఎం.సాగర్ బాబు ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ లేని వాహనదారులను ఆపి హెల్మెట్‌ను ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. హెల్మెట్ లేని వాహనదారులతో హెల్మెట్‌ను కొనుగోలు చేయించారు. ఈ సందర్భంగాఎస్సై మాట్లాడుతూ అత్యధిక శాతం రోడ్డు ప్రమాదాల్లో తలకు బలమైన గాయాలు కావడం వల్లే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయన్నారు. హెల్మెట్‌ను ధరించడం వల్ల ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చన్నారు. హెల్మెట్‌లు నాణ్యమైనవి మాత్రమే వాడాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది


జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలో మాట్లాడుతున్న ఎంవీఐ పరసాద్


హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఎం.సాగర్‌బాబు

హెల్మెట్ ఉందా.. ఇదిగో చాక్లెట్

ద్వారకాతిరుమల: హెల్మెట్‌ను విధిగా ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడుకోవచ్చని తెలియజేస్తూ ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ శుక్రవారం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలను నడుపుతున్న వారికి చాక్లెట్లు అందించి, అభినందించారు. హెల్మెట్లు లేకుండా బైక్‌లు నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, వారితో హెల్మెట్లు కొనిపించారు. ఈ సందర్భంగా ఎస్సై సుధీర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడకాన్ని బాధ్యతగా తీసుకున్నప్పుడే మరణాల సంఖ్యను తగ్గించగలమని ఎస్సై అన్నారు.


ద్వారకాతిరుమలలో హెల్మెట్ ధరించిన వ్యక్తికి చాక్లెట్ అందజేస్తున్న ఎస్సై

ఎలక్ట్రికల్ కార్మికులను ఆదుకోవాలి

జంగారెడ్డిగూడెం: అమెరికాకు చెందిన థామస్ అల్వా ఎడిసన్ బల్బును కనుగొన్న జనవరి 27 పురస్కరించుకొని శుక్రవారం ఎలక్ట్రికల్ డే నిర్వహించారు. జంగారెడ్డిగూడెం ధర్మన్న స్మారక భవనం వద్ద జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్, ప్లంబర్స్, మెకానిక్ యూనియన్ జెండాను యూనియన్ అధ్యక్షుడు ఆవుల పుల్లారావు ఎగరవేశారు. అనంతరం కొట శివకృష్ణ అధ్యక్షత వహించిన సభలో ఆవుల పుల్లారావు, శివ కృష్ణ మాట్లాడుతూ 1880లో అమెరికాకు చెందిన థామస్ ఆల్వా ఎడిసన్ బల్బును కనుగొని పేటెంట్ పొందారని అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా అన్ని ఎలక్ట్రిక్ పరికరాలు అభివృద్ధి చెంది ప్రపంచానికి వెలుగునిస్తున్నాయని అన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వర్కర్లు అందరికీ రక్షణ కోసం ప్రభుత్వాలు బీమా సౌకర్యం కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. కార్మికులు ప్రమాదంలో చనిపోతే కుటుంబాన్ని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఎలక్ట్రికల్ వర్కర్స్ నాయకులను సన్మానించారు ఈ కార్యక్రమంలో కె.సూర్య, బాలిన ధర్మరాజు, వనపర్ల నవీన్ కుమార్, మానేపల్లి రామారావు, తియ్యల గణేష్, గెడ్డం రమేష్, తిప్పాని బాలు, ఏంఎల్ఎస్ రాజు పాల్గొన్నారు


ఎలక్ట్రికల్ డే సందర్భంగా జెండాను ఎగురవేసి నినాదాలు చేస్తున్న ఎలక్ట్రికల్ కార్మికులు

ఆరోగ్య పరిరక్షణకు ఆర్గానిక్ ఉత్పత్తులు

జంగారెడ్డిగూడెం: ఆరోగ్య పరిరక్షణకు ప్రకృతి ఆధారిత ఆర్గానిక్ ఉత్పత్తులు తీసుకోవడమే ఉత్తమమని శ్రీరామచంద్ర అగ్రి అండ్ మిల్క్ ప్రాడక్ట్స్ లిమిటెడ్ ఛైర్మన్ బీవీ కృష్ణారావు అన్నారు. జంగారెడ్డిగూడెంలో శుక్రవారం ప్రకృతి ఆధారిత సేద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ శ్రీరామచంద్ర డైరీ ఫామ్ ద్వారా ఆప్‌ల్యాండ్ ఏరియాలో ఎంతో మంది రైతులకు ఎరువును అందిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో గో ఆధారిత వ్యర్థాలతో ఎరువులను తయారు చేస్తామని తెలిపారు. ప్రకృతి ఆధారిత సేద్యాన్ని నిర్వహిస్తూ ఆప్‌ల్యాండ్ ఏరియా ప్రజలకు ఆర్గానిక్ కూరగాయలను సంస్థ ద్వారా అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శ్రీరామచంద్ర డైరెక్టర్ బాచిరాజు సత్యనారాయణ మాట్లాడుతూ తమ సంస్థల్లో భాగంగా ఉన్న విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ రామచంద్రరాజు గోఆధారిత వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. అభ్యుదయ రైతు దల్లి రామాంజనేయరెడ్డి, కాసర వెంకటరెడ్డి, సిటీ కేబుల్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్, విజయరామరాజు, పరిమి ధర్మరాజు, విద్యాసంస్థల కరస్పాండెంట్ వీవీఎస్ జగదీష్‌కుమార్, ఏవో రమేష్, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీవీ కృష్ణారావు

ఎమ్మెల్యే బాలరాజు క్షేమం కోరుతూ పూజలు

కొయ్యలగూడెం: పోలవరం ఎమ్మెల్యే, శాసనసభ పక్ష ఎస్టీ కమిటీ చైర్మన్ తెల్లం బాలరాజు హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ కావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం బయ్యన్నగూడెంలో ప్రఖ్యాతిగాంచిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఎంపీటీసీ అభ్యర్థి కోరుకొండ బాపిరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుబ్రమణ్యేశ్వర స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక శివసత్యనారాయణాచార్యులు నూట ఒక్క నారికేళ జలాలతో అభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకొని తిరిగి ప్రజా జీవితంలో సమర్థవంతంగా కొనసాగాలని నాయకులు ప్రార్థించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి, ఉపసర్పంచ్ కోరుకొండ లలిత, వైఎస్సార్‌సీపీ నాయకులు మాదేపల్లి పరమేష్, మద్దిపాటి శ్రీను, పూలసరి రాంబాబు, ప్రసన్న, చింతా అంజిబాబు, బాలం నాగ పవన్ కుమార్, తలారి మధు, బాలం సూరిబాబు, కారంకి కృష్ణ, ఉద్దండం వసంతం పాల్గొన్నారు.


బయ్యన్నగూడెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయం

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో జంగారెడ్డిగూడెంకు చెందిన ఫొటోగ్రాఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్‌కు రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో అతని కుటుంబ సభ్యులు ఆందోళనకు చెందుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెంకు చెందిన ఫొటోగ్రాఫర్ మహాశివబట్టు అనిల్ కుమార్ తన స్నేహితుడితో గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జంగారెడ్డిగూడెంలోని త్రివేణి సెంటర్ వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం బలంగా ఢీ కొంది. దీంతో అనిల్ కుమార్ రోడ్డుపై పడటంతో తలకు పెద్ద గాయమైంది. అతడిని ఏలూరు, అక్కడ నుంచి విజయవాడ ఆసుపత్రికి తరలించారు. ఆయనకు శస్త్రచికిత్స చేయాలని వైద్యులు చెప్పారు. జంగారెడ్డిగూడెంలోని ఫొటోగ్రాఫర్లందరూ కలిసి రూ.50వేలు అందజేశారు. దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

చేదోడు ఆన్‌లైన్ గడువు పెంచండి

కొయ్యలగూడెం: చేదోడు పథకానికి ప్రభుత్వం విధించిన గడువు పెంచాలి అని అర్జీదారులు కోరుతున్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ వైఎస్సార్ చేదోడు మూడో విడత పథకానికి నిర్ణీత సమయంలో ఆన్‌లైన్ చేయడానికి పలు అడ్డంకులు ఏర్పడ్డాయన్నారు. ప్రభుత్వం 26వ తేదీ వరకు గడువు విధించగా సర్వర్ల సమస్య, ఇతర సాంకేతిక కారణాల వల్ల దరఖాస్తులు ఆన్‌లైన్ కాలేదని వాపోయారు. దాదాపు 20 శాతం మందికి పైగా అర్జీదారులకు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని టైలర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఈదుపల్లి చంద్రశేఖర్ అన్నారు. ఈ నేపథ్యంలో దర్జీలు, రజకులు, నాయీ బ్రాహ్మణులు తమకు ప్రభుత్వం ద్వారా అందించే రూ.పదివేల సహాయం నిలిచిపోతోందేమోనని ఆందోళన చెందుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సానుకూలంగా స్పందించి గడువును పెంచాలని వారు కోరుతున్నారు.

బాలికకు సైకిల్ అందజేత

జంగారెడ్డిగూడెం: వారధి ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. జంగారెడ్డిగూడెం ఇందిరా నగర్ కాలనీలో వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు వలవల తాతాజీ ఆధ్వర్యంలో స్థానిక బాలికల హైస్కూల్లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని షేక్ రజియాకు శుక్రవారం సైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా 18 సైకిళ్ల అందించాలనే సంకల్పంతో చేపట్టిన కార్యక్రమానికి దాతలు విరివిగా సహకరిస్తున్నారన్నారు. మండవల్లి రాంబాబు వితరణతో విద్యార్థినికి సైకిల్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల హెచ్ఎం బి.నాగేశ్వరకుమార్, బసవరాజు వేణు, మద్దిపాటి శ్రీను, తియ్యాల ప్రసాద్, కంబాల పండు, షేక్ సిరాజ్, ఆఫీస్ ప్రసాద్, కుమార్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ సమావేశం శుక్రవారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. పరిషత్ అధ్యక్షుడు చిలుకూరి సాయిబాబు ఆధర్వ్యంలో నిర్వహించిన సమావేశంలో బ్రాహ్మణ సంక్షేమ సంఘ భవన నిర్మాణంపై చర్చించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ స్థానిక జెడ్పీ హైస్కూల్ వద్ద 13వ వార్డులో బ్రాహ్మణ సంఘానికి చెందిన ఖాళీ స్థలంలో భవన నిర్మాణం చేపట్టనున్నామన్నారు. దీనికి కాకాని హరిబాబు, పూళ్ల భరద్వాజ్ రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించగా, కల్లూరి రాధాకృష్ణ రూ.15వేలు అందజేసినట్లు తెలిపారు. పురోహిత సంఘం అధ్యక్షుడు గరిమెళ్ల బాబు, సభ్యులు పాల్గొన్నారు.

స్నేహితుడికి సహాయం అందజేత


మల్లయ్యకు ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

బుట్టాయగూడెం: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన స్నేహితుడికి పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. పూర్వ విద్యార్థి తెల్లం గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేపులపాడుకు చెందిన చోడెం మల్లయ్య అనే వ్యక్తి తన స్వగ్రామంలో కిరాణా కొట్టు ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇటీవల కిరాణా సరుకుల కోసం ద్విచక్ర వాహనంపై జంగారెడ్డిగూడెం వెళ్తుండగా ప్రమాదవశాత్తూ బండి అదుపు తప్పి పడిపోవడంతో ఎడమకాలుకు బలమైన గాయమైంది. దీనితో జంగారెడ్డిగూడెంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడని తెలిసి 10వ తరగతి 1995 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సుమారు రూ.31,000 ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కూరం వెంకటేశ్వరరావు, బుద్దుల లక్ష్మణ్, తెల్లం శ్రీను పాల్గొన్నారు.

ఖాళీ ప్రదేశంలో దుకాణాలు ఏర్పాటు చేయాలి

చింతలపూడి: నగర పంచాయతీ ప్రత్యేక అధికారి, ఆదర్శ రాజేంద్రన్ ఆదేశాల ప్రకారం పట్టణంలో రోడ్డుకిరుపక్కలా మార్జిన్లలో దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులతో శుక్రవారం కమిషనర్ ఎన్ రాంబాబు సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా రైతు బజారులో ఖాళీగా ఉన్న దుకాణాల్లో వ్యాపారాలు చేసుకోవాలని ఆదేశించారు. పట్టణంలోని దుకాణదారులు షాపుల్లో వచ్చే చెత్తను తడిచెత్త, పొడిచెత్త డబ్బాలలో వేర్వేరుగా వేసి పారిశుద్ధ్య వాహన సిబ్బందికి అప్పగించాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.వెయ్యి జరిమానా విధిస్తామని చెప్పారు.


పట్టణంలోని చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న నగర పంచాయతీ కమిషనర్ ఎన్ రాంబాబు

క్లుప్తంగా

నేడు పారిజాతగిరిలో రథసప్తమి వేడుకలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 28వ తేదీ శనివారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈవో మానికల రాంబాబు తెలిపారు. ఉదయం 9 గంటల 30 నిమిషాలకు సూర్యప్రభ వాహన సేవ అనంతరం ఆలయ పుష్కరిణిలో సుదర్శన పెరుమాళ్ళకు చక్రస్నానం, అనంతరం భక్తులకు అన్న ప్రసాదం వితరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని వేంకటేశ్వరుని అనుగ్రహం పొందాలని ఈవో కోరారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం

జంగారెడ్డిగూడెం రూరల్: కేతవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వ్యక్తికి విద్యార్థులు సహాయాన్ని అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న మద్దిపాటి రాంబాబుకి త్రివేణి కళాశాల విద్యార్థులు కొయ్యల వంశీ మోహన్, చాపల ఠాగూర్, దుగ్గిరాల రాజు నెలకు సరిపడా నిత్యావసరాలు, బియ్యం, కూరగాయలు, బీఎస్సీ విద్యార్థి శీలం దివ్య రూ.వెయ్యి అందజేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పారేపల్లి నరేష్ ద్వారా రాంబాబు పరిస్థితిని తెలుసుకుని సహాయాన్ని అందించినట్లు విద్యార్థులు తెలిపారు. సేవాభావాన్ని చాటిన విద్యార్థులను కరస్పాండెంట్, హెచ్ మురళీమోహన్, డైరెక్టర్ ఫణీష్ అభినందించారు.

చింతలపూడి ఎత్తిపోతల పథకం పరిశీలన


రెడ్డిగణపవరంలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎన్. పుల్లారావు తదితరులు

బుట్టాయగూడెం: చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులను క్వాలిటీ చీఫ్ ఇంజనీర్ ఎన్. పుల్లారావు శుక్రవారం పరిశీలించారు. బుట్టాయగూడెం మండలంలోని కొవ్వాడ సమీపంలోని పనులతో పాటు రెడ్డిగణపవరం వద్ద, జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం సమీపంలోని బయోటెక్ పనులను ఆయన పరిశీలించారు. ఆయా పనులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. పనుల ప్రగతి వివరాలను చింతలపూడి ఎత్తిపోతల పథకం జంగారెడ్డిగూడెం డివిజన్ ఈఈ వై. కృష్ణయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఏఈ ఏ. ఝాన్సీ, గాయత్రి ప్రాజెక్టు మేనేజర్ కె. అజ్మీర్, రవి, ఏజీఎమ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు


దాతలకు నూకాలమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నూకాలమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించగా, ఆలయ కమిటీ ఛైర్మన్ రాజాన సత్యనారాయణ, రామలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు మనోజ్ శర్మ, అభిషేకాలు, వివిధ పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కోసం చీకటి దివ్యతేజ, దుర్గాశారద, నిత్విక్ శ్రీసాయి కుటుంబసభ్యులు రూ. 62,116, డాక్టర్ లింగాల సాయికృష్ణ, డాక్టర్ వెంకట హిమబిందు, కన్నికకృతిసాయి కుటుంబసభ్యులు రూ. 25,116 విరాళంగా అందజేసినట్లు రాజాన సత్యనారాయణ తెలిపారు. దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలకు మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థి


హ్యాండ్ బాల్ ఫోటీలకుఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

కామవరపుకోట: అంతర విశ్వవిద్యాలయాల హ్యాండ్ బాల్ పోటీలకు స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్.నతానియులు శుక్రవారం తెలిపారు. ఇటీవల కాకినాడలో ఐడియల్ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల హ్యాండ్ బాల్ పోటీల్లో కళాశాల విద్యార్థిని బి.నాగలక్ష్మి విశేష ప్రతిభ కనబరిచి మహిళ విభాగంలో అంతర్ విశ్వవిద్యాలయాల హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ విద్యార్థిని ఫిబ్రవరిలో కేరళలోని కొట్టాయంలో నిర్వహించనున్న అంతర్ విశ్వ విద్యాలయాల హ్యాండ్ బాల్ పోటీలలో నన్నయ యూనివర్సిటీ తరపున మహిళా జట్టులో పాల్గొనన్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేలు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్ర, ఎం.మల్లేశ్వరరావు, డాక్టర్ జి.శ్రీనివాసరావు, జి.రామ్మోహన్‌రావు, వి.శ్రీనివాస్, డి.మల్లేష్, ఎ.హర్షవర్ధని, నజ్మా, సిబ్బంది గ్రామస్తులు అభినందించారు.

విభజన హామీలు అమలు చేయాలి

కొయ్యలగూడెం: సీపీఎం మండల కమిటీ సమావేశం ఏ దుర్గారావు అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏలూరు జిల్లా సీపీఎం సెక్రటేరియట్ సభ్యులు మొడియం నాగమణి హాజరై రాజ్యాంగ రక్షణ, దేశ స్వావలంబన కోసం ఉద్యమించాల్సిన బాధ్యత దేశంలో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అధికారంలో ఉన్న రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ రాజ్యాంగం మౌలిక సూత్రాలపై బీజేపీ దాడి చేస్తోందన్నారు. సనాతన విధానం పేరుతో మనుధర్మ శాస్త్రాన్ని, అప్పటి పద్ధతులను ప్రజలపై రుద్దాలని చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం నమ్మకద్రోహం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ సత్యనారాయణ కడియం సీతారాముడు పాల్గొన్నారు.